నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 13 డిసెంబర్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో బీఆర్ఎస్వీ నేత కుర్వ పల్లయ్య

సర్కారు వైఫల్యాలను ఎండగట్టాలి

- గద్వాల జిల్లా నేతలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం

అయిజ, డిసెంబర్ 12 : జిల్లాలోని గురుకుల బాలు, కేజీబీవీలు, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోని వసతుల కల్పనపై సర్కారు వైఫల్యాలను ఎక్కడిక్కడే ఎండగట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని నందినగర్‌లో కేటీఆర్‌ను బీఆర్ఎస్వీ జిల్లా నేత కుర్వ పల్లయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పల్లయ్య కేటీఆర్‌తో గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పర్యటించగా గుర్తించిన సమస్యలపై నివేదికను తయారు చేసినట్లు వివరించారు. ఏడాది కాలంగా కాంగ్రెస్ సర్కారు పాఠశాలలు, కళాశాలను నిర్లక్ష్యం చేస్తుందని కేటీఆర్‌తో చెప్పినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని కేటీఆర్‌కు వివరించారు. మౌలిక వసతుల కల్పనపై అసెంబ్లీలో ప్రస్తావించి, సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం దిగి వచ్చేలా చూడాలని కేటీఆర్‌ను కోరినట్లు పల్లయ్య తెలిపారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి

పెబ్బేరులో ఆందోళన నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- కేసీఆర్ హయాంలో రూ.కోట్ల పనులు మంజూరు
- రాజకీయ దురుద్దేశంతో నిలిపివేత
- పెబ్బేరు ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ నేతలతో వాగ్వాదానికి దిగిన పోలీసులు

పెబ్బేరు, డిసెంబర్ 12 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీలో కోట్లాది రూపాయల తో చేపట్టిన అభివృద్ధి పనులను.. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతో మధ్యలో నిలిపి వేయడాన్ని నిరసిస్తూ గురువారం పార్టీ పిలుపు మేరకు ఉమ్మడి మండలం నుంచి వచ్చిన నాయకులు పెబ్బేరులో ధర్నాకు సిద్ధమయ్యారు. విషయం గ్రహించిన పోలీసులు ఆందోళను అడ్డుకొనేందుకు పెద్దఎత్తున బలగాలను మోహరించారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులతోపాటు, పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల నాయకులు రోడ్డుపై కూర్చొని ఆందోళనకు దిగగా పోలీసులు వారిని లేపేందుకు ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో నాయకులు, పోలీసులకు వాగ్వాదం చోటు చేసుకున్నది. కొందరు నాయకులను పోలీసులు బలవంతంగా ఎత్తుకెళ్లి జీపులో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు ఆందోళనను నిలవరించే ప్రయత్నం చేయగా నాయకులు కొన సాగించేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో ఉద్రిక్తత నెలకొన్నది. అనంతరం అరెస్టు చేసిన నాయకులను విడిచిపెట్టాలని డిమాండ్ చేస్తూ పోలీస్‌స్టేషన్ వద్ద కూడా ధర్నాకు దిగారు. అనంతరం సొంత పూచీకత్తుపై పోలీసులు వారిని వదిలిపెట్టారు.

రాజకీయాల మధ్య ప్రజలు నష్టపోతున్నారు..

పెబ్బేరు మున్సిపాలిటీలో నిధులు పుష్కలంగా ఉండి.. టెండర్లు, అగ్రిమెంట్లు అయిన పనులను కాంగ్రెస్ నాయకులు ఉద్దేశ పూర్వకంగా అడ్డుకుంటున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి ఆరోపించారు. ఆ పనులు పూర్తి చేస్తే బీఆర్ఎస్ పాలకవర్గానికి మంచి పేరు వస్తుందన్న దురుద్దేశంతో ముందుకు సాగనీయడం లేదన్నారు. దీంతో గతుకుల రోడ్లతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, రాజకీయాల మధ్య అమాయకులు నలిగిపోతున్నారని వాపోయారు. ఈ విషయంలో ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినా తమ పలుకుబడితో వారిని ప్రభావితం చేస్తూ పనులు జరగనివ్వడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పనులు పూర్తి చేసే వరకు వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తూనే ఉంటామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎల్లారెడ్డి, గోపిబాబు, పార్వతి, సుమతి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాములు, పట్టణ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, శ్రీరంగాపురం సింగిల్ విండో అధ్యక్షుడు జగన్నాథం, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు వెంకటేశ్, సాయినాథ్, రమేశ్, శంకర్, విశ్వరూపం, మధు, మజీద్, పృథ్వీరాజు, సత్యం, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చదువు సాగేదెలా?

మహబూబ్‌నగర్‌లోని అర్బన్ కేజీబీవీ

- సమ్మెలోకి సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు
- కస్తూర్బా గాంధీ విద్యార్థినుల భవిత ప్రశ్నార్థకం
- బోధన సాగక చదువులో వెనుకబడుతున్న వైనం
- పట్టిం పులేని ప్రజాపాలన ప్రభుత్వం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబర్ 12 : మరో రెండు, మూడునెలల్లో ఇంటర్, టెన్త్ పబ్లిక్ పరీక్షలు ఉన్నాయి. ప్రత్యేక సమయం కేటాయించి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాల్సిన సమయం.. ఇది విద్యార్థుల భవిష్యత్‌కు కీలక సమయం. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం చేసిన తప్పిదంతో విద్యార్థుల భవితను ప్రశ్నార్థకం చేస్తోంది. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ)లో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతోపాటు సమస్యలు పరిష్కరిస్తానని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. దీంతో వారంతా హామీలు నమ్మి ఓటు వేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పాలన పగ్గాలు చేపట్టి ఏడాది గడిచినా ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను మాత్రం ప్రభుత్వం అమలు చేయడం లేదు. ఎన్ని విజ్ఞప్తులు, ధర్నాలు చేసినా స్పందించకపోవడంతో విసుగు చెందిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు ప్రభుత్వ మెడలు వంచైనా సరే.. హామీలను అమలు చేయించాలని సంకల్పించారు. ఇందుకు అల్టిమేటం జారీ చేశారు. అయినా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. విధిలేని పరిస్థితుల్లో సమ్మెకు దిగారు.

సమ్మెతో చదువులకు దూరం

సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మెతో కేజీబీవీలు సహా ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో బోధన బంద్ అయ్యింది. సమ్మె కారణంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కేజీబీవీల్లో పాఠ్యాంశాల బోధనకు అంతరాయం కలుగుతోంది. పాఠాలు చెప్పడం పూర్తిగా బంద్ చేశారు. కేవలం కొందరు సిబ్బంది వంట చేసి పిల్లలకు పెడుతున్నారు. దీంతో విద్యార్థులు హాస్టల్ గదులకే పరిమితమయ్యారు. కేజీబీవీల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు సుమారు 20వేలకు పైగా విద్యార్థినులు చదువుకుంటున్నారు. తాజాగా ఎస్ఎస్ఏ, కేజీబీవీ ఉద్యోగుల సమ్మెతో వీరి విద్యా బోధనకు అంతరాయం ఏర్పడింది.

సర్కారు దిగివచ్చేదాక సమ్మె

గతంలో 3 రోజులపాటు ధర్నాలు చేసినా సర్కారు పట్టించుకోలేదు. ఈసారి ప్రజాపాలన ప్రభుత్వం దిగి వచ్చే దాకా సమ్మెను కొన సాగిస్తామంటూ ఎస్ఎస్ఏ ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు. మూడు రోజులుగా కొన సాగుతున్న వీరి సమ్మెను మరింత ఉధృతం చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాలు సైతం వారికి మద్దతిస్తున్నాయి. దీంతో సర్వశిక్షా ఉద్యోగులు సమ్మెను మరింత ఉధృతంగా కొన సాగిస్తున్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెతో మండల విద్యావనరుల కేంద్రాలు సైతం వెలవెలబోతున్నాయి. జిల్లాలోని ప్రతి మండలానికి ఒక ఎమ్మార్సీ ఉంది. ఇందులోని ఉద్యోగులంతా కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్నవారే. ఇప్పుడు వీరంతా సమ్మెలో ఉండడంతో ఎమ్మార్సీలకు తాళాలు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. కేవలం ఇన్‌చార్జీలు మాత్రమే విధుల్లో ఉండడంతో వారు సొంత స్కూళ్లకు వెళ్లి పాఠశాలు చెప్పే పరిస్థితి ఏర్పడింది.

కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యార్థినులు

పాలమూరులో నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

జిల్లాల వారీగా కేజీబీవీలు, విద్యార్థినులు

మహబూబ్‌నగర్ జిల్లాలో 14 కేజీబీవీలు ఉండగా.. 4,149 మంది విద్యార్థినులు ఉన్నారు. జోగులాంబ-గద్వాల జిల్లాలో 12 కేజీబీవీల్లో 3,501 మంది, నాగర్‌కర్నూల్‌లో 20 కేజీబీవీల్లో 5,525 మంది, నారాయణపేటలో 11లో 3,344 మంది, వనపర్తి జిల్లాలో 15 కేజీబీవీల్లో 3,710 మంది విద్యార్థినులు ఉన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులు ఇలా..

సమగ్ర శిక్ష అభియాన్ కింద కేజీబీవీలు, యూఆర్ఎస్, ఆశ్రమ పాఠశాలలు, మైనారిటీ గురుకులం, జిల్లా విద్యా శాఖ మండల విద్యాధికారి కార్యాలయాలు, భవిత కేంద్రాలు, మండల రీసోర్స్ కేంద్రం, ఆర్ట్స్, క్రాఫ్ట్స్ టీచర్స్, సీఆర్‌పీ తదితర 13 విభాగాల్లో పనిచేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 600మంది, గద్వాలలో 430, వనపర్తిలో 513, నాగర్‌కర్నూల్‌లో 750, నారాయణపేట జిల్లాలో 380 మంది పనిచేస్తున్నారు.

ఎంఈవో గురుతర బాధ్యత

- ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెతో విద్యార్థినులకు పాఠాలు

పాఠాలు బోధిస్తున్న ఎంఈవో రవీంద్రబాబు

ధరూరు, డిసెంబర్ 12: మండల వనరుల కేంద్రంలోని సర్వశిక్ష ఉద్యోగులు సమ్మెబాట పట్టడంతో మండల విద్యాధికారి ఉపాధ్యాయుడిగా పాఠాలు బోధించాడు. ఎమ్మార్సీ కార్యాలయానికి ఎవరూ రాక పోవడంతో కేజీబీవీ టీచర్లు కూడా సమ్మెలో పాల్గొన డానికి వెళ్లగా.. గురువారం ఎంఈవో రవీంద్ర బాబు కార్యాలయానిక తాళం వేసి, మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు పాఠాలు చెప్పాడు. ఇలా అయితే కస్తూర్బా విద్యార్థినుల భవిష్యత్‌ప్రశ్నార్థకమవుతుంది.

ప్రతిఒక్కరూ యోగా చేయాలి


పుల్లూరు ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

- ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 12 : గ్రామాల్లో ఉండే ప్రజలు ప్రతిఒక్కరూ యోగా, వ్యాయామం చేస్తే ఎలాంటి రోగాలు దరిచేరవని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లావెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం ఉండవెల్లి మండలం పుల్లూరులో అధ్యాత్మిక క్షేత్ర వైభవ ఆనంద్ మార్గ ఆశ్రమాన్ని సందర్శించారు. మొదట ఆశ్రమంలో ఉన్న వారి యోగక్షేమలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రజలకు యోగా, వ్యాయాయం, భక్తి మార్గాలలో ప్రజలను చైతన్యవంతులను చేయడం సంతోషకరమన్నారు. ప్రజలు ఉదయాన్నే యోగా, వ్యాయామం తప్పనిసరిగా చేయాలని అప్పుడే ఒత్తిడి తగ్గి మానసికస్థైర్యం పెరుగుతుందని, దీని వల్ల ఎలాంటి రోగాలు రాకుండా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

అలంపూర్ నియోజకవర్గంలో గ్రామాలన్నీ అభివృద్ధి దిశగా నడిపిస్తామని ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని స్వగ్రామ వైభవ పుల్లూరులో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడు ముందుంటామన్నారు. ప్రజలు ఎవరికి ఏ కష్టం వచ్చినా తమకు కలిస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన సంజన్న, బోయ నాగేశ్ కుటుంబాలను పరామర్శించారు. వారి వెంట గోపాల్, రఘురెడ్డి, పర వేశ్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అక్రమ అరెస్టులకు భయపడం

- మాజీ ఎంపీపీ గుంత మౌనిక

కొత్తకోట రాణా ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మదనాపురం, డిసెంబర్ 12: రాజకీయ కుట్రతో బీఆర్ఎస్ నాయకులపై అక్రమంగా కేసులు పెడ తున్నారని కొత్తకోట తాజా మాజీ ఎంపీపీ గుంత మౌనిక అన్నారు. మండలంలోని నాటవెల్లి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎడ్దుల నగేశ్ ఏపీ నుంచి వరి ధాన్యం తీసుకొచ్చి నాటవెల్లి కొనుగోలు కేంద్రంలో అనుమతి లేకుండా నిల్వ ఉంచారని, బోనస్ కాజేసేందుకు పాల్పడ్డాడంటూ ఆరోపిస్తూ అక్రమంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం సరికాదన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న మాజీ సర్పంచ్ ఎడ్దుల నగేశ్‌ను గురువారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఎడ్దుల నగేశ్ మాట్లాడుతూ.. రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక కాంగ్రెస్ నాయకులు అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయిస్తే భయపడే ప్రసక్తి లేదన్నారు. ఐదేళ్లపాటు నేను సర్పంచ్‌గా మరో ఐదేళ్లపాటు నా భార్య నాటవెల్లికి సర్పంచ్‌గా సేవలందించారన్నారు. గ్రామంలో తమకున్న ఆదరణ చూసి ఓర్వలేక కొందరు వ్యక్తులు తమ ప్రతిష్టకు భంగం కలిగించాలనే దురుద్దేశంతో ధాన్యం కొనుగోలు కేంద్రం లో అక్రమంగా నిల్వ ఉంచారని ఆరోపించడం సరికాదన్నారు. తనకు సంబంధం లేకున్నా.. కేసులో ఇరికించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. గడిచిన 10 ఏళ్లపాటు నాటవెల్లిని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. పోలీసులు అత్యుత్సాహంతో రోడ్డుపై ఉన్న తనను ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పకుండా పోలీస్‌స్టేషన్‌కు తీసుకురావడం ఏంటని ప్రశ్నించారు. పోలీసులు కాంగ్రెస్ నాయకులు పెడుతున్న ఒత్తిళ్ల వల్లే తనను అక్రమంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్ ఎదుట అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ ఆందోళన చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు విశ్వేశ్వర్, కృష్ణయ్య, సీడీసీ మాజీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, కౌన్సిలర్లు నాగన్న, రాములు యాదవ్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు అల్లబాషా, చాంద్‌పాషా, వసీం ఖాన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాసులు, శ్రీనూజీ, అయ్యన్న, ప్రేమ దాసం, మనోజ్ మల్, మహేశ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

పేటలో పురుగుల అన్నం

- భోజనాన్ని పారబోసిన గ్రౌండ్ స్కూల్ విద్యార్థులు
- మధ్యాహ్నం కడుపు మాడ్చుకున్న స్టూడెంట్స్
- విద్యార్థులతో కలిసి పీడీఎస్‌యూ ఆందోళన
- బియ్యం తెప్పించి మళ్లా వండించిన హెచ్ఎం

పాఠశాలలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న దృశ్యం

మధ్యాహ్న భోజనంలో వచ్చిన పురుగులు

నారాయణపేట రూరల్, డిసెంబర్ 12 : ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వడ్డించడంలో అధికారులు విఫలమవుతూనే ఉన్నారు. మొన్న మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటన జరిగిన తర్వాత ఫుడ్ కమిటీలు ఏర్పాటు చేస్తామని, ఇకపై ఎక్కడా పురుగుల అన్నం, రాళ్ల అన్నం లేకుండా నాణ్యమైన భోజనం వండించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఆచరణలో మాత్రం అమలు కావడం లేదనడానికి తాజాగా నారాయణపేట గ్రౌండ్ స్కూల్‌లో చోటు చేసుకున్న సంఘటనే ఉదాహరణ. పాఠశాలలో పురుగులు, రాళ్లు ఉన్న అన్నం వడ్డించారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 900 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో సగం 400 మందికి గురువారం మధ్యాహ్న భోజనం కోసం 50 కిలోల బియ్యంతో వంట చేయించారు. అయితే అన్నంలో పురుగులు, రాళ్లు కనిపించడంతో విద్యార్థులు పారబోశారు. విద్యార్థుల కడుపుమంటను తెలుసుకొన్న పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు బడి వద్దకు చేరుకొని విద్యార్థులతో కలిసి ఆందోళనకు దిగారు. దీంతో హెచ్ఎం దత్తురావు స్పందించి వారికి నచ్చజెప్పి వేరే బియ్యంతో మళ్లా భోజనం వండించి పెట్టడంతో సద్దుమణిగింది.

భోజనంలో నాణ్యత పాటించాలి

రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో ప్రభుత్వ బడుల్లో వడ్డించే మధ్యాహ్న భోజనంలో పురుగులు, రాళ్లు రావడం సిగ్గుచేటమని పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్ ధ్వజమెత్తారు. దీంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వ పాఠశాలలు నాణ్యత పాటించాలని, లేకుంటే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తాసీల్దార్, కలెక్టర్, ఎమ్మెల్యే కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సభ్యులు పార్వతి, సాగర్, నాయకులు విష్ణు, రేణుక, అంజి, వైశాలి, నర్సింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో పురుగులు వచ్చిన విషయంపై డీఈవో గోవిందరాజులు, మిడ్ డే మిల్స్ ఇన్‌చార్జి యాదయ్య శెట్టిని వివరణ కోరగా.. బుధవారం ప్రభుత్వ సివిల్ సప్లయి గోదాం నుంచి తీసుకొచ్చిన కొత్త బియ్యంతోనే మధ్యాహ్న భోజనం వండామన్నారు. అలాగే ఆ బియ్యం ఎలా ఉన్నాయో కూడా మేము పూర్తిగా పరిశీలించలేదన్నారు. విద్యార్థుల నిరసనతో మళ్లీ కొత్త బియ్యాన్ని జల్లెడపట్టి వండించి భోజనం వడ్డించారు. పాఠశాలకు తెచ్చిన బియ్యం మొత్తం పరిశీలించి వాటిని జల్లెడ పట్టి ఇకపై ఎలాంటి పొరపాట్లు లేకుండా నాణ్యమైన భోజనం అందిస్తామన్నారు.

నారాయణపేటలో విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నాగర్‌కర్నూల్ ట్యాంక్‌బండ్‌పై కమ్ముకున్న పొగమంచు

మంచు దుప్పటి

- ట్యాంక్‌బండ్‌పై కనిపించని బుద్ధుడు

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబర్ 12 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాన్ని గురువారం తెల్లవారు జామున పొగమంచు దుప్పటిలా కమ్మేసింది. పట్టణంలోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న బుద్ధుడి విగ్రహం పొగ మంచుతో కమ్ముకు పోవడంతో ఏ మాత్రం కన్పించలేదు. పొగ మంచు ఎక్కువగా ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనదారులు లైట్లు వేసుకొని నెమ్మదిగా వెళ్లారు.

ఇందిరమ్మ కమిటీపై నాయకుల వాగ్వాదం

దేవరకద్ర, డిసెంబర్ 12 : మండల కేంద్రంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుల జాబితాపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. దేవరకద్ర పట్టణ ఇందిరమ్మ కమిటీ కోసం పట్టణంలో ఉన్న ఇరువర్గాల కాంగ్రెస్ నాయకులు రెండు జాబితాలో పేర్లను రాసి ఎంపీడీవోకు ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే ఇరువర్గాల జాబితాలో ఉన్న పేర్లను కలిపి ఇందిరమ్మ కమిటీకి ఆమోదం తెలిపారు. అయితే ఆ జాబితాలో కాంగ్రెస్ పార్టీలో ఇటీవల చేరిన వ్యక్తికి ఇందిరమ్మ కమిటీ చోటు లభించడంతో పార్టీలోకి కొత్తగా వచ్చిన వారిని కమిటీలో ఏ విధంగా తీసుకున్నారని ప్రశ్నించడంతో కాంగ్రెస్ వర్గాలు వాగ్వాదానికి దిగాయి. దీంతో ఎంపీడీవో ఈజాబితాలను ఎమ్మెల్యే పరిశీలించి ఆమోదించారని చెప్పడంతో వారు అక్కడి నుంచి వెళ్లి పోయారు.